## ప్రేమ్‌సాగర్‌రావు తగిన బుద్ధి చెప్పాలి




సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

సైఫాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త: తమ ప్లాట్లను అక్రమించి వేదిస్తున్న మంచిర్యాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావును ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని ఉద్యోగ, దళిత బహుజన ప్లాట్స్ ఓనర్స్ సొసైటి కార్యదర్శి జి.గోపాలరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మండలంలోని పంపుగూడలో 62 ఎకరాల భూముల్లో వేసిన వెంచర్లలో సొసైటి సభ్యులు ప్లాట్స్ కొనుగోలు చేయడం జరిగిందన్నారు. మధ్యవర్తుల ద్వారా ప్లాట్స్ అమ్మి పది లక్షల రూపాయలు ఇప్పిస్తామని ఆయన కొన్ని ప్లాట్స్‌ను అక్రమించుకున్నారని ఆరోపించారు. తమ ప్లాట్స్‌లోకి తమని వెళ్ళనీయకుండా అడ్డుకుంటున్నారని, కొన్ని ప్లాట్స్‌లో గల ఇళ్ళను కూల్చివేయడం జరిగిందని, ఈ విషయంపై స్థానిక జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళ జిల్లా జట్ల ఎంపిక

నిజాంపేట్, నవంబర్ 28, ప్రభాతవార్త : మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 01.12.2023 తేదీ శుక్రవారం రోజున ఉదయం 10గంటలకు సీనియర్ మహిళ జిల్లా జట్ల ఎంపిక పోటీలు కాసాని కబడ్డీ అకాడమీ, బాచుపల్లి నందు జరుగుతాయని మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, సెక్రటరీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాసాని వీరేష్ ముదిరాజ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మేడ్చల్ జిల్లాకు సంబంధించిన సీనియర్ మహిళ క్రీడాకారులు, బరువు 75 కేజీలలోపు కలిగి ఉన్న వారు తమ ఆధార్‌కార్డుతో డిసెంబర్ 1వ తేదీ ఉదయం 10గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైనటువంటి మేడ్చల్ జిల్లా సీనియర్ మహిళ జట్టు, డిసెంబర్ 4 నుండి 7వ తేదీల మధ్య నిజాంబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తుందని మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, సెక్రటరీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాసాని వీరేష్ ముదిరాజ్‌లు తెలిపారు. మేడ్చల్ జిల్లాకు చెందిన సీనియర్ మహిళ కబడ్డీ క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలలో పాల్గొని తమ ప్రతిభని కనబరిచి రాష్ట్ర స్థాయిలో మేడ్చల్ జిల్లాకు ప్రఖ్యాతి తీసుకురావాలని వారు కోరారు.

## శ్రీను నాయక్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

**గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు వెంకట్ బంజారా**



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌బంజారా, గణేష్‌నాయక్

హైదరాబాద్, నవంబర్ 28, ప్రభాతవార్త: సేవావాల్‌సేన జాతీయ అధ్యక్షులు సబావత్ శ్రీను నాయక్‌పై ఈనెల 17న జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌బంజారా, నంగారా భేరీ లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సభావత్ శ్రీను నాయక్‌లు అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జడ్చర్లలో స్థానిక పోలీస్ అధికారులతో కుమ్మక్కై ఓభూకబ్జాదారుడు ఈఘాతుకానికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఘనట జరిగి ఇన్ని రోజులు అవుతున్నా వారిని అరెస్ట్ చేయకపోవడం అన్యాయమని తనపై దాడికి కారణమైన వారి పేర్లను ప్రస్తావిస్తూ శ్రీను నాయక్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చినా చర్యలు తీసుకోకపోవడంతోపాటు ఘటనకు సంబంధం లేనివారిని కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇకనైనా దోషులను అరెస్ట్ చేయాలని లేనిపక్షంలో డిసెంబర్ 6న గిరిజన సంఘాల ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో నిరసన దిగుతామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఇందల్ రాథోడ్, రోహిత్, సుధీర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హన్మంత్‌రెడ్డికి మద్దతుగా శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, నవంబర్ 28, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం కొలన్ శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు పాదయాత్ర చేపట్టి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం ఆఖరి దిశకు చేరుకున్న సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ మొత్తం సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొని హస్తం గుర్తుకు ఓటు వేసి హన్మంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చే ఆరు హామీల గురించి వివరంగా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, టిడిపి సోదరులు, కెసిఆర్ సైన్యం భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్

**: ఎమ్మెల్యే కెపి వివేకానంద**



ఎమ్మెల్యే వివేకానందకు మద్దతు తెలుపుతున్న జామియాత్ ఉలామా-ఈ-హింద్ సంస్థ సభ్యులు

జీడిమెట్ల, నవంబర్ 28, ప్రభాతవార్త : ఎన్నికల ప్రచారంలో భాగంగా మైనార్టీ ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేసిన బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యే కెపి వివేకానంద అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ జామియాత్ ఉలామా-ఈ-హింద్ సంస్థ మంగళవారం తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతి, సంక్షేమం కోసం మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్ళ సంఖ్య పెంపు, షాదిముబారక్, రంజాన్ తోఫా, విదేశాల్లో చదివే మైనార్టీ విద్యార్థుల కోసం ఇరవై లక్షల రూపాయల స్కాలర్షిప్ వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరిచిన ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. మైనార్టీల అభ్యున్నతి, సంక్షేమం కోసం పనిచేసే బిఆర్ఎస్ పార్టీని మరోమారు మూడవ నెంబర్‌పై ఓటు వేసి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జామియాత్ ఉలామా-ఈ-హింద్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మోహమ్మద్ షకీల్, మౌలానా అబ్రార్ అహ్మద్, ఉపాధ్యక్షులు మౌలానాలు నయీమ్ సాబ్, సభ్యులు తాషారిక్ ఆలం, శంషాద్, అజారుద్దీన్, ముస్తాకీమ్, ఇర్ఫాన్, అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ ముజీబ్, మహబూబ్, సలీం, బిఆర్ఎస్ నాయకులు అబ్దుల్ ఖాదీర్, సిరాజ్ భాయ్ పాల్గొన్నారు.

## నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా.. అవకాశం కల్పించండి

**కాంగ్రెస్ శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్**




రోడ్‌షో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని, కార్పొరేటర్‌గా తన పనితీరును గమనించి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు నియోజకవర్గం మొత్తం భారీ రోడ్‌షోలు, బైక్ ర్యాలీలు నిర్వహించి సుడిగాలి పర్యటనలతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొని అసెంబ్లీ ఎన్నికల చివరి రోజు ప్రచారాన్ని ముగించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సేవలో తన కుటుంబం నిమగ్నమై ఉందన్నారు. తాను సైతం ప్రజల ఆశీర్వాదంతో మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా పనిచేసే అవకాశం లభించిందని, తన పదవీకాలంలో ఎటువంటి బంధుప్రీతి, అవినీతి, పక్షపాతానికి తావు లేకుండా కార్పొరేటర్‌గా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఉన్నత విద్యావంతుడినైన తనకు శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్ధి మీద ప్రత్యేక ప్రణాళిక ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం జనాభా పరంగా రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గమని, ఇక్కడి జనాభాకు అనుగుణంగా పూర్తి మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దేశంలోని అన్ని ప్రాంతాల వారు నివసిస్తూ మినీ ఇండియాను తలపిస్తుందని, కుల, మత, వర్గ, ప్రాంత బేధాలు లేకుండా అందరికి సమన్యాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా పనిచేస్తానని అన్నారు.

## రాజేంద్రనగర్ గడ్డపై "కాషాయం" జెండా ఎగురడం ఖాయం

- బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి
- చివరి రోజు భారీ బైక్ ర్యాలీ తీసిన బిజెపి
- అసమర్థ నాయకులకు గుణపాఠం తప్పదు



రాజేంద్రనగర్‌లో జరిగిన చివరి రోజు ప్రచారంలో విజయం నాదే అంటూ ప్రచారం చేస్తున్న బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

నార్సింగి, నవంబర్ 28 ప్రభాతవార్త : తొలిసారిగా రాజేంద్రనగర్ గడ్డపై "కాషాయం" జెండా ఎగురడం ఖాయమని బిజెపి అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంకు చివరి రోజు కావడంతో వందలాది మంది అభిమానులతో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. దారి పొడవునా బిజెపి కార్యకర్తలు చేసిన జైశ్రీరాం... జైజై శ్రీరాం... భారత్‌మాతాకీ జై... నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి... కమలం గుర్తుకే ఓటేయాలి... తోకల గెలుపు రాజేంద్రనగర్ అభివృద్ధికి మలుపు... జైజై శ్రీనివాస్‌రెడ్డి, బైబై ప్రకాశ్ గౌడ్... వంటి నినాదాలతో ఆయా ప్రాంతాలు దద్దరిల్లిపోయాయి. ప్రచార రథం పై నుంచి తోకల శ్రీనివాస్‌రెడ్డి విజయం నాదే అంటూ బాణంను సంధించారు. సుమారు 3.కిలో మీటర్ల దూరం బైక్ ర్యాలీనే కనిపించింది. రెండు గంటల పాటు తోకల శ్రీనివాస్‌రెడ్డి తన అభిమానుల శక్తిని ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ అందిస్తున్న సమర్థవంతమైన, నీతివంతమైన పాలన రాజేంద్రనగర్‌లో అందాలంటే ప్రజలంతా "కమలం" గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. 15.ఏళ్ల అసమర్థ నాయకుడి పాలనకు చరమ గీతం పాడాలని పిలుపు నిచ్చారు. గండిపేట, రాజేంద్రనగర్ సర్కిల్, శంషాబాద్... ఇలా ఏ మండలానికి వెళ్లినా ప్రజలంతా బిజెపికి భారీగా మద్దతు తెలిపారన్నారు. ముఖ్యంగా కేంద్రమంత్రి అమిత్‌షా, ఎంపి రవికిషన్, సీనియర్ బీజేపీ నేతలైన ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిల రోడ్‌షోలతో రాజేంద్ర నగర్‌లో రాజకీయ సిత్రం పూర్తిగా మారిపోయిందని, అటూ ఇటుగా ఉన్న ప్రజానికమంతా బిజెపి వైపుకు మళ్లా రన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన కార్యకర్తల్లో నయా జోష్‌ను తెచ్చిందని, ఎన్నికల కదన రంగంలో కమల దళాలు కొదమ సింహాల్లా దూకారని, ఒక్కొక్కరు 100.మందిని కలిసి బిజెపిని గెలిపించాలని ప్రచారం చేశారన్నారు. మూడుమార్లు గెలిచిన అభ్యర్థి రాజేంద్రనగర్‌లోని ప్రధాన సమస్యలేమి? చేసిన అభివృద్ధి ఏమీ? అని ప్రశ్నిస్తే పట్టుమని 15.నిమిషాలు కూడా మాట్లాడలేకపోతున్నారని తోకల విమర్శించారు.

## రెండు రాష్ట్రాలలో నష్టం వస్తుందని తెలిసినా తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

**ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్**



మంగళవారం ఆఖరి ఎన్నికల ప్రచారంలో ముషీరాబాద్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త: ఎటుచూసిన జనప్రభంజనం, తరలివచ్చిన కాంగ్రెస్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో రోడ్లన్ని కిక్కిరిసిపోయాయి. మంగళవారం ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ భారీ మహా పాదయాత్రను చేపట్టారు. చిక్కడపల్లి నుంచి ప్రారంభమైన ఈ మహా పాదయాత్ర ఆర్టీసిక్రాస్‌రోడ్స్, గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్ చౌరస్తా మీదుగా కవాడీగూడ, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పౌరులు పెద్దఎత్తున పాల్గొనగా వీరి వెంట కళాబృందాల నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాద యాత్రకు మహిళలు, యువకులు పెద్దఎత్తున తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ వాహనంపై ఉండి ఓటర్లను తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జనసమితి గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అధ్యక్షుడు ఎం.అనీల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు వాజీద్‌హుస్సేన్, ఆర్.కల్పనాయాదవ్, రామ్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోహెర్ హుస్సేన్, ముషీరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, నేతలు ఆవుల లోకేష్ యాదవ్, ప్రఫుల్‌రాంరెడ్డి, మనోహర్‌సింగ్, అనీల్‌యాదవ్, శ్రీధర్ యాదవ్, గుర్రం శంకర్, మారిశెట్టి నర్సింగరావు, గుండు జగదీశ్‌బాబు, గుండు సురేందర్, బాబ్జీ, నల్లవెల్లి అంజిరెడ్డి, వైఎస్‌ఆర్‌సిపి నాయకుడు ప్రవీణ్, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటిని అమలు చేసి తీరుతానన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, సోనియాగాంధీ నేతృత్వంలోనే అది సాధ్యమైందని, ప్రజలందరు ఇది గమనించి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు.

## పాతబస్తీలో హోరాహోరీగా ముగిసిన ఎన్నికల ప్రచారం



చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ముజీబుల్లా షరీఫ్



చార్మినార్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి మెఘారాణి అగర్వాల్



బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్

చార్మినార్, నవంబరు 28 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగి యటంతో పాతబస్తీలో ఏఐఎంఐఎం, కాంగ్రెస్, బిజెపి, ఎంబిటి పార్టీలు హోరాహోరీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిం చాయి. బిఆర్ఎస్ ఎంఐఎంతో స్నేహ పూర వ్వకంగా ఎన్నికల బరిలో ఉన్నందున పాతనగరంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఎన్నికల ప్రచారానికి పరిమితం అయ్యింది. ప్రచారం చివరి రోజున ఎంఐఎం పాతబస్తీ కిల్వత్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు. చార్మినార్, యాకుత్‌పుర, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర, కార్వాన్, మలక్‌పేట్, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాలలో ఎంఐ ఎం పోటీ చేస్తున్నది. చార్మినార్‌నుంచి చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ తనయుడు డాక్టర్ నూరుద్దీన్ పోటీ చేస్తారని చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. ఊహించని విధంగా చార్మినార్ నుంచి మాజీ మేయర్ మీర్ జుల్ఫికర్ అలీని, మరో మాజీ మేయర్ మాజీద్ హుస్సేన్‌ను నాంపల్లి నియోజకవర్గం నుంచి పార్టీ బరిలోకి దింపింది. మూడు సార్లు కార్పొరేటర్‌గా విజయం సాధించిన మహ్మద్ ముబీన్‌కు బహదూర్‌పుర నియోజకవర్గం టిక్కెట్ కేటాయించింది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన అక్బరుద్దీన్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి ఆరవ సారి ఎన్నికల బరిలో ఉన్నారు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ సుడిగాలిలా పాతబస్తీలో పర్యటించి పార్టీ అభ్యర్థుల విజయం కోసం జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు.

**యాకుత్‌పురలో ఎంఐఎం, బిఆర్ఎస్, ఎంబిటి, బిజెపిల మధ్య తీవ్రమైన పోటీ**

నాంపల్లి నియోజకవర్గం శాసన సభ్యులుగా రెండు సార్లు విజయం సాధించిన మెహరాజ్ హుస్సేన్ ప్రస్తుత ఎన్నికల్లో యాకుత్‌పుర నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. ఎంబిటి విషయానికి వస్తే మాజీ శాసన సభ్యులు అమా నుల్లాఖాన్ తనయుడు రెండు సార్లు కార్పొరేటర్‌గా విజ యం సాధించిన అమ్జాదుల్లాఖాన్ యాకుత్‌పుర నియోజ కవర్గం నుంచి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. రెండవ సారి యాకుత్‌పుర నుంచి బిఆర్ఎస్ తరుపున సామ సుందర్‌రెడ్డి పోటీ చేస్తుండగా, కె.రవిరాజు కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో ఉన్నారు. యాకుత్‌పుర నియోజక వర్గంలో ఎంఐఎం, బిఆర్ఎస్, ఎంబిటి, బిజెపి పార్టీల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో హోరాహోరీగా ప్రచారం కొనసాగింది.

**చార్మినార్ నియోజకవర్గం పైనే అందరి దృష్టి**

చార్మినార్ విషయానికి వస్తే మాజీ మేయర్ మీర్ జుల్ఫికర్ అలీ ఎన్నికల బరిలో ఉండటంతో అందరి దృష్టి చార్మినార్ నియోజకవర్గంపై ఉంది. ఎంఐఎం అభ్యర్థి, మాజీ మేయర్ మీర్ జుల్ఫికర్ అలీకి ధీటుగా ఇక్కడ బిజెపి అభ్యర్థి న్యాయవాది మెఘారాణి అగర్వాల్ పార్టీ విజయం కోసం జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. కాగా నాయ్యవాది, టిపిసిసి కార్యదర్శి ముజీబుల్లా షరీఫ్‌కు ఆఖరి నిమిషంలో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కేటాయించింది. చార్మినార్ నియోజక వర్గంలో ఎన్నడు లేని విధంగా పార్టీ విజయం కోసం నాయ కులు ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ముజీబుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గంలో పాద యాత్రలు, ర్యాలీలు, సభలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గంలో ఎంఐఎంకు ధీటుగా హోరాహోరీగా ప్రచారాన్ని నిర్వహించింది.

**బహదూర్‌పురలో ఎంఐఎంకు ధీటుగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం**

శాస్త్రిపురం డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ముబీన్ బహ దూర్‌పుర నియోజకవర్గం నుంచి మొదటి సారిగా ఎంఐఎం తరుపున పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. ఎంఐఎంకు కంచుకోటగా ఉన్న బహ దూర్‌పుర నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ ఎంఐఎంకు ధీటుగా హోరాహోరీగా ప్రచా రాన్ని నిర్వహించారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ యువ న్యాయ వాది, టిపిసిసి కోఆర్డినేటర్ పులిపాటి రాజేష్ కుమార్‌ను ఎన్నికల బరిలోకి దింపింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నరేష్ బిజెపి తరుపున, మీర్ ఇనాయాత్ అలీ బా క్రీ బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగియటంతో డిసెంబరు 3న ఏ పార్టీ విజయం సాధిస్తోందో తెలుస్తుంది.




# ఉప్పల్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి భారీ ర్యాలీ

## భారీగా తరలివచ్చిన ప్రజలు : అడుగడునా జన నీరాజనం



భారీ ర్యాలీ నిర్వహించిన బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తదితరులు



బిఎల్ఆర్ బైక్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన నేతలు, ప్రజలు, కార్యకర్తలు,

**ఉప్పల్, నాచారం, నవంబరు 28 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాప్రా ఎఎస్‌రావునగర్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కుషాయిగూడ, మీర్‌పేట్, హెచ్‌బికాలనీ, మల్లాపూర్,నాచారం, ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్ తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్‌నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. బిఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఒకసారి అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతి కార్యకర్త ప్రజలను ఓటువేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భారీఎత్తున నిర్వహించిన ర్యాలీకి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో పార్టీ ఇంచార్జీ రావుల శ్రీధర్‌రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, బోంతు శ్రీదేవి, శాంతి సాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, పావనిరెడ్డి, గొల్లూరి అంజయ్య,పలువురు డివిజన్ అధ్యక్షులు, వివిధ అనుబంధ కమిటి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ ర్యాలీకి జన నీరాజనం :**
ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీకి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. కాప్రా ఎఎస్‌రావునగర్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ మల్లాపూర్, నాచారం ప్రధాన ప్రాంతాల మీదుగా భారీ ఎత్తున సాగింది. ర్యాలీలో డప్పు, వాయిద్యాలతో కార్యకర్తల హోరుతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారుల వద్ద పార్టీ నేతలు గుమిగూడి బండారి లక్ష్మారెడ్డికి స్వాగతం పలికారు. బండారి లక్ష్మారెడ్డికి పూలమాలలు వేసి భారీ ఎత్తున స్వాగతం పలికారు. కార్యకర్తల హోరు, వాహనాల ర్యాలీతో ఉప్పల్ నియోజకవర్గం పరిసరాలు మారుమ్రోగాయి. బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని పలువురు కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

# నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం : సుధీర్‌రెడ్డి



కమ్మ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, ఎల్‌బినగర్, నవంబర్ 28 ప్రభాతవార్త:** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్‌పరిధిలోని శ్రీపురం ఎస్.ఏం.ఆర్ ఫంక్షన్ హాల్‌లో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్‌చౌదరి ఆధ్వర్యంలో కమ్మ సామాజికవర్గ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ కమ్మసంఘం వారితో వారికున్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కమ్మ వారిని ఓటు అభ్యర్థించే అర్హత తనకే ఉందన్నారు. తనకు రాజకీయ పునర్జన్మను ఇచ్చింది చంద్రబాబుఅని, ఈ విషయాన్ని ఎలక్షన్లకోసం మాత్రమే కాదు గతంలో జరిగిన మన ఆత్మీయ సమావేశంలో తెలియజేసిన విషయం గుర్తు చేసుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ల్యాండ్ మార్క్‌గా ఉన్న వనస్థలిపురం పనామా చౌరస్తాను స్వయంగా కేటీఆర్ వద్దకు తీసుకు వెళ్లి పనామా చౌరస్తాను ఎన్.టీ.ఆర్.చౌరస్తాగా మార్చి జీ.ఓ.ను తెచ్చి కమ్మ పెద్దల చేతిలో పెట్టి చరిత్రలోనిలిచిపోయే చరిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించడంలో తన పాత్రను గుర్తు చేసారు. చంద్రబాబువిషయంలో కూడా తనే ముందుండి నిరసన కార్యక్రమాలలో కమ్మ సామాజికవర్గంతో పాల్గొన్న విషయాన్ని వారి ముందుంచారు. అదేవిధంగా ఎల్బీనగర్ పరిధిలో ఉన్న కమ్మ సామాజిక మిత్రులకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన తక్షణమే స్పందించి సహాయం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే రేవంత్‌రెడ్డి టిడిపిని నిండా ముంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారన్నారు. నియోజకవర్గ ప్రజల బాధలు, కష్టాలు ఏనాడు పట్టించుకోలేదని తెలిపారు. సీమాంధ్ర వాసులకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా కమ్మ సామాజికవర్గానికి ఆత్మీయునిగా ఉన్న తనకు మద్దతు పలికి ఆశీర్వదించి మరొక్కసారి అసెంబ్లీకి పంపి నియోజకవర్గ అభివృద్ధిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోవి కొండల్‌రావు, సాంబయ్య, కొమ్మి హరిబాబు, జగన్‌మోహన్‌రావు, పలువురు కమ్మ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

**కొత్తపేట డివిజన్ పరిధిలో...** మరోసారి ఎన్నికలలో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్తపేట డివిజన్ పరిధిలో సాయికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు కులాల సంబంధించిన కులపెద్దలతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎన్నికల్లో సుధీర్‌రెడ్డిని గెలుపించుకుంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, పార్కులు, స్విమ్మింగ్‌ఫూల్స్, రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తాను చేసిన అభివృద్దే మరొక్కమారు విజయనికి నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ లింగాల నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, విజయ, తోట కృష్ణయాదవ్, అశోక్ బలిజ, రాములు రజక, కొమ్ము బాబు, వెంకటేష్, సత్యనారాయణ, రమేష్, రామేశ్వర్‌గౌడ్, తోట శ్రీనుయాదవ్, కాట రాజకుమార్‌గౌడ్, కాట నర్సింహగౌడ్, శ్రీశైలంగౌడ్, శశిపటేల్, కన్నా పటేల్, సుధాకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించండి : చల్లా నర్సింహారెడ్డి



ప్రచారం చేస్తున్న చిగిరింత నర్సింహారెడ్డి, పారిజాత



కెఎల్ఆర్ సతీమణితో కలిసి ప్రచారం చేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 28 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని కమలా నగర్, ప్రగతినగర్ జాయినగర్, దాసరినారాయణరావునగర్, మిథిలానగర్, లక్ష్మీనర్సింహస్వామికాలనీ, దీన్‌దయాళ్‌నగర్‌లతో రోడ్ షోల ద్వారా ప్రచారం చేశారు. అదే విధంగా కెఎల్ఆర్ సతీమణి విజయలక్ష్మితో కలిసి కార్పొరేషన్‌లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రజలు విశ్వాసం ఉంచి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు సేవ చేయడానికి వచ్చిన కెఎల్ఆర్‌ను మంచి మనస్సుతో ఆదరించి ఆయనకే ఓటు వేయాలని చల్లా కోరారు. ఈ కార్యక్రమంలో కొత్త జనార్ధన్‌రెడ్డి, గంగమ్మ, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, పరశురాం, రాజేందర్, సైదులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో చిగిరింత దంపతుల ప్రచారం**
కెఎల్ఆర్‌కు మద్దతుగా బడంగ్‌పేట్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డిలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు పార్టీ నాయకులు, కార్యకర్తలతో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో విస్తృత ప్రచారం చేశారు. ఇందులో భాగంగా వారు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు సంబంధించిన కర పత్రాలను ఓటర్లకు పంపిణీ చేసి కెఎల్ఆర్‌కే ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం: కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**
**ఎల్‌బినగర్, ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ జెండా ఎగురవేసి తీరుతామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువవికాసం, చేయూత తదితర పథకాలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు. తెలంగాణలో కెసిఆర్ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె తిప్పడానికి ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా దోపిడీ చేశారని, మిగులు నిధులతో ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తమిళనాడు ఎంపీ వరప్రసాదరావు, నాయకులు భాస్కర్ రెడ్డి, ఉన్నా గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డి, బండి మధు, ఎన్ఎస్ యుఐ శివ పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా : సబితాఇంద్రారెడ్డి



రోడ్ షోలో ప్రసంగిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 28 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు కరోనా కష్టాల్లో, వరద ముంపు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న సమయంలో కనిపించకుండా నేడు ఓట్ల కోసం ముంగిటకు వస్తున్న కాంగ్రెస్, బిజెపిలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ చౌరస్తా, జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్ చౌరస్తా, దాసరి నారాయణరావునగర్, కమలా నెహ్రూనగర్ ప్రాంతాల్లో జరిగిన రోడ్ షోల్లో మంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు కరోనా కల్లోలంలో తాము వేలాది మందికి అండగా ఉండి సాయం చేస్తే ఆ సమయంలో ప్రతిపక్ష నేతలు కనిపించలేదని అన్నారు. ఆ తర్వాత భారీ వర్షాల సమయంలో వరద ముంపు సమస్యల్లో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే తాను మోకాలి లోతు నీటిలో పర్యటించి ఆపన్న హస్తం అందించామనీ ఆ సమయంలో ట్రాక్టర్లలో విహార యాత్రకు వచ్చిన చందంగా ఓ ప్రతిపక్ష నేత వచ్చారనీ మరో ప్రతిపక్ష నేత అయితే ఆనాడు కనిపించనే లేదని ఆమె వ్యంగంగా అన్నారు. ఎల్లప్పుడు మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి అందుబాటులో ఉండే తానే ఇక్కడ ప్రజా సేవ చేస్తాననే నమ్మకం ప్రజల్లో ఉందని ఆమె స్పష్టం చేశారు. 30న జరిగే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

**సబితమ్మకు ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ మద్దతు...** బిఆర్ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డికి మద్దతు ప్రకటించిన ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ ఆమెకే ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని ముస్లిం మైనారిటీ వర్గాలకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి ఆయన జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాహీన్‌గనర్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి సబితారెడ్డి ఎంతో కృషి చేశారనీ ఇక్కడి ప్రాంతాల అభివృద్ధికి, ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూశారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమెకే ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అహ్మద్ సాది, ఓమర్ బామ్, హసన్ భాయ్, ఉస్మాన్, అబ్దుల్లా సాదిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి : మర్రి రాజశేఖర్‌రెడ్డి



మల్కాజిగిరి ర్యాలీలో ప్రజలు ఉద్దేశించి మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్ నవంబర్28 ప్రభాతవార్త:** మల్కాజిగిరినియోకజవర్గంలో బిఆర్ఎస్ పార్టీగెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేసి, తనను భారీ మెజార్టీతో గెలిపెంచాలని మల్కాజిగిరి నియోజకవర్గ బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గ ప్రజలను కోరారు. మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మౌలాలి, ఆనంద్‌బాగ్, సఫిల్‌గూడ నుండి మల్కాజిగిరి సర్కిల్ మీదుగా మిర్జాల్‌గూడవరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సుమారు 20వేల మంది నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ది పరచాలంటే కేసీఆర్‌తోనే అది సాధ్యమవుతుందన్నారు. కళ్యాణలక్ష్మి, ఆసరా, దళితబంధు, స్వయం ఉపాధివంటి ఎన్నో నూతన పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పేదలు,బడుగు, బలహీనవర్గాలు, మహిళల అభివృద్ధి, వారి సంక్షేమ కొరకు బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఒక్కరికి చేరుతాయన్నారు. 3వ సారి సీఎంగా కేసీఆర్‌కే పట్టం కట్టాలని రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేసి బి.ఆర్.ఎస్ పార్టీ గెలుపుకు పాటుపడాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హాయాంలోనే పేద ప్రజలు, రైతులు సంతోషంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు ఎంఐఎం మద్దతు ఇచ్చినా అంతిమ విజయం బిజెపిదే: అందెల



నమూనా బ్యాలెట్‌లో తన 1వ నెంబర్‌ను చూపిస్తున్న అందెల శ్రీరాములు

**సరూర్‌నగర్, నవంబర్ 28 ప్రభాతవార్త:** మహేశ్వరంలో నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ మద్దతు పలికినా విజయం మాత్రం బిజెపిదేని ఆ పార్టీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు సందర్భంగా మంగళవారం బిజెవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో ఆయన రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సబితా ఇంద్రారెడ్డికి ముస్లింలు ఓటు వేయాలని షాహీన్‌నగర్‌లో జరిగిన ప్రచారంలో అసదుద్దీన్ పిలుపు ఇవ్వడం పై మండిపడ్డారు. ఇదే విషయం అసదుద్దీన్ మహేశ్వరం నడి గడ్డకు వచ్చి చెప్పాలని ఆయన నిప్పులు చెరిగారు. మహేశ్వరం నియోజకవర్గంలో స్థానికులు కాని ఎంఐఎం వర్గీయులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించుకొని అదే విధంగా ఇక్కడి ప్రభుత్వ భూములను దోచుకొని గూండాయిజం చేయడానికే ఎంఐఎం మహేశ్వరం నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నదని ఆయన ఆరోపించారు. ఎంఐఎం చెంపచెళ్లు మనేలా ప్రజలు బిజెపిని గెలిపించాలని అందెల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాపయ్యగౌడ్, కడారి జంగయ్యయాదవ్, సుదర్శన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, యాదీష్, మంద జ్యోతి పాండు, మాధవాచారి, అశోక్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే ఎల్‌బినగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి : మధుయాష్కీగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ

**సైదాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హయత్‌నగర్ వాసిని అయిన తాను విదేశాల నుంచి వచ్చిన తర్వాత పార్టీ ఆదేశాల మేరకు నిజామాబాద్‌కు వెళ్లడం జరిగి ందన్నారు. నిజామాబాద్‌ను ఎలాఅభివృద్ధి చేసానో అక్కడి ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినప్పుడు కూడా పార్టీని వీడకుండా బలోపేతం చేయడం జరిగిందన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌లు రెండు ఒక్కటేనని ప్రజలు గుర్తించాలన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గం తన కుటుంబమని అన్నారు. సరూర్‌నగర్ చెరువు సెప్టిక్ ట్యాంకులా మారిందని, బిఎన్‌రెడ్డినగర్ రిజిస్ట్రేషన్ సమస్య అదేవిధంగా ఉందని ఆయన ఆరోపించారు. ఎల్‌బినగర్ ప్రజలు అత్యధిక టాక్స్ కడుతున్నారన్నారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పదవిలో ఉండి, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మధుయాష్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. నియోజకవర్గంలోని సివరేజి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

# మీలో ఒకడిని.. ఒక్క అవకాశం ఇవ్వండి : సామ రంగారెడ్డి



ప్రచారంలో ప్రసంగిస్తున్న సామ రంగారెడ్డి

**వనస్థలిపురం, ఎల్‌బినగర్, నవంబర్ 28 ప్రభాతవార్త:** 16 యేళ్లుగా ఎలాంటి పదవి లేకున్నా ప్రజాసేవలో ఉన్న తనకు ఈ సారి ఓటు వేసి గెలిపించాలని ఎల్‌బీనగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చంపాపేట డివిజన్‌లో పాదయాత్ర, గడ్డిఅన్నారం, కొత్తపేట డివిజన్‌లలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ..పదవులు, అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి గెలిచిన తర్వాత పార్టీ మారే వారికి భిన్నంగా తాను ఎలాంటి పదవి లేకున్నా నిత్యం నియోజకవర్గ ప్రజల సేవలో ఉన్నానన్నారు. నిబద్ధతతో కూడిన రాజకీయాలే తన లక్ష్యమన్నారు. కేసీఆర్ కుటుంబ, నిరంకుశ, నియంతృత్వ, గడీల పాలనను ఓటుతోనే తరిమికొట్టాలన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొనకపోతే ముందు తరాల భవిష్యత్తును నాశనం చేసిన వారవుతారన్నారు. ఎన్నో ప్రజా హితమైన కార్యక్రమాలు చేపట్టిన బీజేపీ ఎస్సీ రిజర్వేషన్‌కు కట్టుబడడమే కాకుండా బీసీని ముఖ్యమంత్రిగా ప్రకటించి బడుగు, బలహీనవర్గాల పట్ల తనకున్న ప్రేమను చాటుకుందన్నారు. అవినీతిరహిత పాలన కోసం, మంచి మార్పు కోసం బీజేపీని గెలిపించాలని కోరారు.

**ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా : సామ...** కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డితో కలిసి మంగళవారం భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశం పటిష్ఠంగా ఉందని, రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు వస్తాయని, రైతులకు మద్దతు ధర వస్తుందని, రాష్ట్రానికి బడుగు బలహీన వర్గాల నాయకుడు ముఖ్యమంత్రి అవుతాడనీ అన్నారు. పేద ప్రజల బతుకులు మారాలంటే, కాలనీలు అభివృద్ధి చెందాలంటే, బిజెపికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక్కసారి బిజెపికి అవకాశం ఇవ్వాలని నియోజకవర్గం ప్రజలను గుండెల్లో పెట్టుకుంటానని, ఎల్లవేళల అండగా నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ ర్యాలీలో బిజెపి రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, నాయకులు మంచి రాజేష్, అంబాల మల్లేష్, గీతరెడ్డి, అశ్విన్‌సింగ్, మహేందర్‌యాదవ్, ఉపేందర్‌సింగ్, రమేష్‌చారి, కొత్త తిరుమల్, శివ, గట్టు మహేష్, మోతీలాల్‌నాయక్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిశ్శబ్దం... అంతా గప్ చుప్...

## నెల రోజులుగా హోరెత్తించిన ప్రచారం



**ఎల్‌బినగర్, నవంబరు 28 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గత నెల రోజులుగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు నియోజకవర్గంలో పోటాపోటీగా ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా పార్టీల మేనిఫెస్టోలో ఎన్నికల్లో గెలిపిస్తే తాము చేసే అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని చేపట్టారు. అదేవిధంగా పోటీలో ఉన్న అభ్యర్థులు ఒకరిపైఒకరు రాజకీయంగా, వ్యక్తిగతంగా పరస్పర విమర్శలు చేసుకున్నారు. నెల రోజులుగా హోరెత్తించిన ప్రచారజోరు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. దీంతో ఎల్బీనగర్ నియోజకవర్గంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. నెల రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారజోరు కొనసాగించిన పార్టీల నేతలు చివరి రోజు మంగళవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో భారీ ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించారు. కాగా 30వ తేదీన ఎన్నికలు జరగనుండడంతో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీకి చెందిన అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ అంతర్గత ప్రచారాన్ని కూడా కొనసాగించే విధంగా ఆయా పార్టీల నాయకులు ప్రణాళిక రూపొందించుకున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల నాయకులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి : తహశీల్దార్

## అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 163 పోలింగ్ కేంద్రాలు

**అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 28 ప్రభాతవార్త:** ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ఏర్పాట్లు పూర్తయినట్లు తహశీల్దార్ రవీందర్‌దత్తు ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితా 2023 ప్రకారం మండలంలో 139 పోలింగ్ కేంద్రాలు ఉండగా... కొత్తగా 24 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కొత్త కేంద్రాలతో కలిపి మండలంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 163కు చేరినట్లు ఆయన వివరించారు. మండలంలో మొత్తం 1,67,452 ఓటర్లు ఉన్నారని అందులో 85,101 పురుషులు, 82,320 మంది స్త్రీలు, థర్డ్ జెండర్ 31 ఉన్నట్లు తెలిపారు. కొత్తగా మునుగనూర్‌లోని ఎడ్యుస్మార్ట్ పాఠశాలలో 2, మండల ప్రజా పరిషత్ పాఠశాలలో 3,ఇంజాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో 2, తుర్కయాంజాల్ జడ్పీహెచ్ఎస్‌లో 7, రాగన్నగూడ మండల పరిషత్ పాఠశాలలో 2, కమ్మగూడలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 3, కుంట్లూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో 3, పసుమాములలోని మండల పరిషత్ పాఠశాలలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతి కూడా కల్పించామని వివరించారు. ఓటుహక్కు కలిగి ఉన్నవారు తప్పనిసరిగా ఓటువేయాలని సూచించారు.

# మలక్‌పేట హరిహరక్షేత్రంలో ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు



హరిహరక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**మలక్‌పేట, నవంబర్ 28 ప్రభాతవార్త:** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహర క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో సోమవారం రాత్రి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ఛైర్మన్ సూగూరు రమేష్ మాట్లాడుతూ డిసెంబర్ 8వ తేదీ శుక్రవారం రాత్రి గణపతి వార్షికోత్సవం, సాయంత్రం అభిషేకాలు, గణపతి హోమం, ప్రసాద వితరణ కార్యక్రమాలు, 11వ తేదీ సోమవారము మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా ఉదయం మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకములు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, చంద్రశేఖరశర్మ, ఇట మార్తంధరావు, సభ్యులు శ్రీహరి, రేణుఅగర్వాల్, పారిజాతారెడ్డి, సత్యేందర్, విజయ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.